ప్రజాశక్తి

శ్రీకాకుళం
మంగళవారం 24 సెప్టెంబరు 2024

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిగా సాయికుమార్

శ్రీకాకుళం : జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిగా ఉరిటి సాయికుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన పార్వతీపురం మన్యం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిగా పనిచేస్తూ బదిలీపై జిల్లాకు వచ్చారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలెక్టరేట్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిగా పనిచేసిన పి.బి సాయి శ్రీనివాస్ విజయవాడ రాష్ట్ర కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అభ్యర్థులు

పోలీసు అభ్యర్థుల పోరు

- శ్రీకాకుళంలో ర్యాలీ, జెడ్‌పి వద్ద ఆందోళన
- ప్రభుత్వ కాలయాపనతో అన్యాయం
- డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న 6,100 పోస్టుల భర్తీని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యాన పోలీస్ రిక్రూట్‌మెంట్ అభ్యర్థులు జెడ్‌పి కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. తొలుత శ్రీకాకుళం నగరంలోని స్థానిక గాంధీ పార్కు నుంచి ఏడు రోడ్ల కూడలి, కళింగరోడ్, పాతబస్టాండ్ మీదుగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. చేతిలో ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. కానిస్టేబుల్ నోటిఫికేషన్ ద్వారా వెంటనే ఉద్యోగాలను భర్తీ చేయాలని, పెంచిన హోంగార్డుల రిజర్వేషన్లను తగ్గించాలని, తమకు ఇచ్చిన హామీని విద్యాశాఖ మంత్రి లోకేష్ నిలబెట్టుకోవాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ర్యాలీకి అధిక సంఖ్యలో అభ్యర్థులు తరలివస్తున్నారన్న సమాచారంతో పోలీసులు జెడ్‌పి గేట్లను మూసేశారు. దీంతో అభ్యర్థులు అక్కడే కొద్దిసేపు కూర్చొని ఆందోళన కొనసాగించారు. పోలీసులు జోక్యం చేసుకుని కలెక్టర్‌ను కలిసేందుకు ఐదుగురికి అనుమతి ఇవ్వడంతో వారు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

ప్రభుత్వ కాలయాపనతో పోలీసు రిక్రూట్‌మెంట్ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న విమర్శించారు. రెండేళ్ల కిందట వచ్చిన 6,100 పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్ ఇప్పటివరకు పూర్తి చేయకపోవడం సిగ్గుచేటు అని, వెంటనే భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. దేహదారుఢ్య పరీక్షలు, మెయిన్స్ రాత పరీక్షలు నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన 6,100 పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో 95,208 మంది పోలీస్ అభ్యర్థులు ప్రాథమిక రాత పరీక్ష రాసి అర్హత సాధించారని, వారికి తర్వాత నిర్వహించాల్సిన దేహదారుఢ్య పరీక్షలు, మెయిన్స్ రాత పరీక్షలు ఇప్పటివరకు నిర్వహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఏదైతే హోంగార్డులకు రిజర్వేషన్లు, సివిల్ 8 నుంచి 15 శాతం, ఎపిఎస్‌పి 15 నుంచి 25 శాతానికి పెంచడం వల్ల నిరుద్యోగులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టులో హోంగార్డులకు అనుకూలంగా వచ్చిన తీర్పుపై రిక్రూట్‌మెంట్ బోర్డు జనరల్ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని భావించి మార్కులతో సంబంధం లేకుండా తీసుకోవాలని ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టులో కేసును అప్పీల్ చేశామని చెప్పారు. కేసు దాదాపు నాలుగు వాయిదాలు పడినా గత ప్రభుత్వం దీనిపై పట్టించుకోకపోవడంతో, రెండేళ్ల కాలయాపన జరిగి పోలీస్ అభ్యర్థులు పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వమైనా న్యాయం చేస్తుందని నిరుద్యోగులు భావించి కూటమి ప్రభుత్వాన్ని ఆదరించారని, గత ప్రభుత్వం మాదిరిగానే వ్యవహరిస్తూ ఈ ప్రభుత్వమూ కేసు విచారణకు హాజరు కాకుండా నయవంచన చేస్తోందని విమర్శించారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ రెండేళ్లుగా నిలిచిపోవడంతో నిరుద్యోగులందరూ మానసిక వేదనకు గురవుతున్నారని తెలిపారు. ప్రశ్నాపత్రంలో ఎనిమిది ప్రశ్నలకు సరైన సమాధానలూ లేవని, కావున వాటికి మార్కులు కలపాలని కొంతమంది అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారని వారికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్టేజ్-2కు అప్లికేషన్ సమర్పించేందుకు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తగిన సమయం ఇవ్వనందున చాలా అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, వారికి న్యాయం చేయాలని కోరారు. పెంచిన హోంగార్డు రిజర్వేషన్లను తగ్గించి, కేసును సత్వరమే పూర్తి చేసి గానీ స్టే అయినా తీసుకొని నోటిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు 'యువగళం' పాదయాత్రలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మీ సమస్యను ఆరు నెలల్లోగా పూర్తి చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే చలో విజయవాడ చేపడతామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు అందజేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఎస్.శ్రవణ్ కుమార్, మౌనిక, గణేష్, చంటి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు

- పలాసలో అత్యధికంగా 40 మి.మీ నమోదు
- బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల విస్తారంగా వర్షాలు కురిశాయి. పలాసలో అత్యధికంగా 40 మి.మీ వర్షపాతం నమోదైంది. కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో 30.25 మి.మీ, రణస్థలం మండలం గరికిపాలెంలో 29.75 మి.మీ, ఇచ్ఛాపురంలో 29.5 మిమీ, టెక్కలి మండలం రావివలసలో 29 మి.మీ వర్షం కురిసింది. బూర్జలో 27.5 మి.మీ, కవిటిలో 25.25 మి.మీ, రణస్థలం మండలం పైడిభీమవరంలో 24.75 మి.మీ వర్షం పడింది. నందిగాం మండలం మదనాపురంలో 24 మి.మీ, సంతబొమ్మాళిలో 23 మి.మీ, లావేరులో 18.5 మి.మీ, హిరమండలం గొట్టాబ్యారేజీ వద్ద 14.5 మి.మీ వర్షం కురిసింది. ఆమదాలవలసలో 12.75 మి.మీ, నరసన్నపేటలో 10.75 మి.మీ, పాతపట్నం మండలం జగ్గిలిబొంతులో 10 మి.మీ, గార మండలం బూరవెల్లిలో 9.75 మి.మీ వర్షపాతం నమోదైంది. వచ్చే మూడు రోజుల్లో జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది.

పాతపట్నంలో కురుస్తున్న వర్షం

నూతన విద్యా విధానం పేరుతో అస్తవ్యస్తం

ఎస్ఎఫ్ఐ సామూహిక రాయబారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో డిగ్రీ కోర్సులను అస్తవ్యస్తం చేసిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యాన నగరంలోని జిల్లాపరిషత్ కార్యాలయంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో సోమవారం సామూహిక రాయబారం నిర్వహించారు. పలు విద్యారంగ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వం డిగ్రీ విద్యా వ్యవస్థలో అనేక మార్పులు చేసిందని, ఈ మార్పులు ఏమాత్రం కూడా విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకు దోహదపడవన్నారు. డిగ్రీ విధానంలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన విద్యా, వసతి దీవెన బకాయిలు రూ.3,480 కోట్లు తక్షణమే విద్యార్థులకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం కాలేజ్ ఖాతాల్లో పడడం వల్ల విద్యార్థులకు ఎటువంటి ఒత్తిడి లేకుండా చదువుకునే పరిస్థితి ఉండేదని, ఆ మొత్తాన్ని తల్లుల ఖాతాలో వేయాలని నిర్ణయించడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్‌లో నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను రూ.మూడు వేల వరకు పెంచాలని, పెండింగ్ బకాయిలను తక్షణమే వసతిగృహాలకు విడుదల చేయాలన్నారు. శ్రీకాకుళం నగరంలో చాలా వసతిగృహాల్లో సొంత భవనాల్లేక అద్దె భవనాల్లో నెట్టుకొస్తున్నారని, కొత్త భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హామీ మేరకు ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం లేక విద్యార్థులు ఒక పూట మాత్రమే కళాశాలకు వెళ్లి ఇరుకు గదుల్లో విద్యాభ్యాసం చేయాల్సి వస్తోందన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న మూడు హాస్టళ్లలో దోమల బెడద ఎక్కువగా ఉందని, మురుగునీరు మొత్తం ఒక దగ్గర నిల్వ ఉండిపోవడం వల్ల దోమల వ్యాప్తికి ఎంతో అవకాశం ఉందని దీనివల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. విద్యార్థులకు దోమతెరలను, దోమలను నివారించేందుకు రసాయనాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల మన రాష్ట్రంలోనే ఎక్కువ మంది విద్యార్థులు చదువుకునే కళాశాలలో మూడో స్థానంలో ఉందని, అటువంటి కళాశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదుల్లేక బయట వచ్చి చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చొరవ తీసుకొని అదనంగా తరగతి గదులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, గర్ల్స్ కన్వీనర్ పవిత్ర, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.రాజు, దుర్గాప్రసాద్, నాయకులు కుసుమ, దియా తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

బిపి చెక్ చేయించుకుంటున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సఫాయి సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఆస్పత్రిలో అన్ని విభాగాల సందర్శన అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే బిపి చెక్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో ఈనెల 17 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషించే పారిశుధ్య కార్మికులు రోగాల బారిన పడే అవకాశం ఎక్కువున్న నేపథ్యంలో వారికి ఉచితంగా అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో డిసిహెచ్ కళ్యాణ్‌బాబు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి, రిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ షకీలా, కార్పొరేషన్ కమిషనర్ ప్రసాద్, హెల్త్ అధికారి సుధీర్, బిజెపి జిల్లా అధ్యక్షులు బి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూపై టిడిపి రాజకీయం

ఎమ్మెల్సీ నర్తు రామారావు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

తిరుమల లడ్డూ ప్రసాదం నాణ్యతపై టిడిపి దుష్ప్రచారం చేస్తూ రాజకీయాలు చేస్తోందని ఎమ్మెల్సీ, వైసిపి నాయకులు నర్తు రామారావు విమర్శించారు. స్థానిక ఎంపిపి ఛాంబరులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఎవరినీ విడిచిపెట్టరని, చివరకు అది దేవుడు అయినా సరే అని ధ్వజమెత్తారు. తిరుమల లడ్డూపై లేనిపోని ఆరోపణలు చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని చెప్పారు. దీని పర్యవసానం పదిరెట్లు అనుభవిస్తారన్నారు. బుడమేరు వరద సహాయ చర్యల్లో ప్రభుత్వం విఫలం కావడం, ఇస్తామన్న సూపర్ సిక్స్ హామీలు ఇవ్వకపోవడం వల్ల ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుండడంతో డైవర్షన్ రాజకీయాలు చేస్తూ లడ్డూ నాటకానికి తెరతీశారని ఆరోపించారు. అధికారంలోకి రావడమే పరమావధిగా ఎన్నికల్లో అలవికాని హామీలిచ్చి, అధికారంలోకొచ్చాక సంక్షేమ పథకాలను అమలు చేయలేక చేతులెత్తేశారని విమర్శించారు. సమావేశంలో ఎంపిపి బోర పుష్ప, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రతినిధి పిలక సంతోష్, వైసిపి పట్టణాధ్యక్షులు ప్రకాశరావు పట్నాయక్, సర్పంచ్‌లు పి.మామయ్య, పి.రాజశేఖర్ రెడ్డి, వైసిపి నాయకులు ఎ.కృష్ణారెడ్డి, కె.మోహనరావు, చిట్టిబాబు, ఎ.పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

మార్కెట్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి మేజర్ పంచాయతీ చిన్న బజారులో రూ.40 లక్షలతో నిర్మించిన కిరాణా, కాయగూరలు, చేపల మార్కెట్ సముదాయాన్ని మంత్రి సోమవారం ప్రారంభించారు. రోడ్డుపై కూరగాయలు విక్రయించకుండా బజారులో అమ్మేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. చిన్న బజారులో ఉన్న ప్రభుత్వ స్థలంలో కాయగూరల మార్కెట్ ఏర్పాటు చేయాలని సూచించారు. నూతన దుకాణాలను పాత జాబితా ప్రకారం వెంటనే కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సుదర్శన్ దొర, మండల ప్రత్యేకాధికారి శైలజ, బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ, తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి, ఎంపిడిఒ సిహెచ్.లక్ష్మీబాయి, టిడిపి మండల, పట్టణ అధ్యక్షులు పినకాన అజయ్ కుమార్, కె.లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కార్పొరేట్లకు అనుకూలంగా లేబర్ కోడ్‌లు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కార్మికవర్గం పోరాడి సాధించిన కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా లేబర్ కోడ్‌లుగా సవరించడం దుర్మార్గమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు విమర్శించారు. కార్మికుల ప్రాణత్యాగాలు, ఆత్మబలిదానాలతో సాధించిన 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా పార్లమెంటులో చట్టం చేయడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్త బ్లాక్ డే పిలుపులో భాగంగా నగరంలోని పిఎస్ఎన్ఎం హైస్కూల్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను పార్లమెంట్‌లో ఎటువంటి చర్చా లేకుండా 2020 సెప్టెంబరు 22న పార్లమెంట్‌లో పాస్ చేశారని, దీనివల్ల కార్మికులను యాజమాన్యాలకు బానిసలుగా మార్చే ప్రమాదం ఉందన్నారు. యజమానుల దయా దక్షిణ్యాల మీద కార్మికులు ఆధారపడే విధంగా తయారు చేశారని విమర్శించారు. ఇవి అమలైతే కార్మికులు మరింత ప్రమాదంలోకి నెట్టబడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుర్మార్గమైన లేబర్ కోడ్‌లను నిరసిస్తూ దేశవ్యాప్తంగా బ్లాక్ డేగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయకపోతే కార్మికులను సన్నద్ధం చేసి భవిష్యత్ పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, పలు సంఘాల నాయకులు ఎన్.నాగేశ్వరరావు, ప్రభావతి, కనకలక్ష్మి, ఎర్రయ్య, జోగారావు, సూర్యారావు, రూపవతి తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : బ్లాక్ డేలో భాగంగా స్థానిక శ్యామ్‌పిస్టన్ ప్లాంట్-3 పరిశ్రమ వద్ద సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.వి రమణ, ఎస్.శ్రీనివాసరావు, జె.సురేష్, ఎం.సునీల్, ఎల్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం : మాట్లాడుతున్న తేజేశ్వరరావు

విఒఎల వేతన బకాయిలు చెల్లించాలి

- 'మీకోసం'లో వినతిపత్రం అందజేత
- నిర్ణీత గడువులోగా అర్జీల పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

విఒఎలకు ఆరు నెలలుగా వేతనాలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బకాయిలను చెల్లించాలని విఒఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇతర అధికారులు కలిసి స్వీకరించిన వినతుల కార్యక్రమంలో వారు వినతిపత్రం అందించారు. వేతనాలకు సంబంధించి ప్రభుత్వానికి, అధికారులకు అనేక పర్యాయాలు వినతిపత్రాలు ఇస్తున్నా చెల్లించకపోవడం అన్యాయమన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విఒఎలు అక్రమ తొలగింపులు, వేధింపులకు గురవుతున్నారని చెప్పారు. స్థానిక రాజకీయ నాయకులతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా విఒఎల అక్రమ తొలగింపులకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని లేకపోతే పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. హెచ్.ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ.పది లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. విఒఎల విలీనం ఆపాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలని కోరారు. 15 సంఘాల్లోపు ఉన్న విఒఎలకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

పని ప్రదేశాల్లో ఫిర్యాదు కమిటీలు

శ్రామిక మహిళల పని ప్రదేశాలలో ప్రభుత్వం ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని శ్రామిక మహిళ జిల్లా కో-కన్వీనర్ ఎ.మహాలక్ష్మి , సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు వినతిపత్రం అందించారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న మహిళలు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల బారిన పడి తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని చెప్పారు. శ్రామిక మహిళలపై వివక్షత అనేక రూపాల్లో కొనసాగుతోందని, సమాన పనికి సమాన వేతన చట్టం ఉన్నా అనేక సెక్టార్లలో అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు శాఖలు, సంస్థల్లో టాయిలెట్స్, మంచినీరు, విశ్రాంతి గదులు, క్రెచ్, భద్రతా సౌకర్యాలు లేక శ్రామిక మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2013లో వచ్చిన లైంగిక వేధింపుల నిరోధక చట్టం సక్రమంగా అమలు కావడం లేదని చెప్పారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణకు నోడల్ ఆఫీసర్లను నియమించలేదన్నారు. అంతర్గత కమిటీలు లేవని, ఉన్న కమిటీలు నామమాత్రంగా పనిచేస్తున్నాయని వివరించారు.

వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

కర్లెమ్మలో భూముల రీసర్వేలో అక్రమాలు

కొత్తూరు మండలం కర్లెమ్మ గ్రామ రెవెన్యూ పరిధిలో ఆ గ్రామానికి చెందిన సుమారు 450 మంది రైతులకు చెందిన 1300 ఎకరాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన పలువురు రైతులు మీకోసంలో ఫిర్యాదు చేశారు. సర్వహక్కులు ఉన్న తమ భూమిలో వేరొకరికి ఈ-పంట నమోదు చేయడం, రీ సర్వేలో ఎల్‌పిఎం నంబర్లలో జాయింట్ రైతుల పేర్లు నమోదు చేయడం వంటి అక్రమాలకు పాల్పడ్డారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుని భూ యజమానులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, రైతులు గేదెల కృష్ణారావు, పి.యతిరాజు తదితరులు ఉన్నారు.

నారాయణపురం కాలువకు నీరు విడుదల చేయాలి

ఎచ్చెర్ల మండలంలో నారాయణపురం కుడి కాలువ ద్వారా వెంటనే నీరు విడుదల చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ వినతిపత్రం అందించారు. నీటి విడుదల కోసం ఇరిగేషన్ అధికారులను కలిసినా ప్రయోజనం కనిపించలేదన్నారు. నీరు లేక 13 గ్రామాల్లోని వరి పంట ఎండిపోతోందని తెలిపారు. నీటి విడుదల్లో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు.

నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరించాలి

'మీకోసం'లో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. అర్జీదారులు ఇచ్చే వినతులను క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం స్వర్ణాంధ్ర 2047 ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్‌తో పాటు జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్ వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ శ్రీకాకుళం 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ Cum ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో
IA 287/2024 IN OS 165/2018

Between:-
GVKG సుబ్రహ్మణ్యం ....petitioner/plaintiff
And:-
గోవిందు సుగుణ and others
...Respondents/Defendants

To,
R-1: **గోవిందు సుగుణ** డైవర్సిడ్ వైఫ్ ఆఫ్ లేట్ గోవిందు, కృష్ణమూర్తి, వయస్సు 61 సంవత్సరాలు, గృహిణి కేరాఫ్ గొర్తి శ్యామల రిటైర్డ్ కోర్టు ఎంప్లాయ్, R/o, Opposite పెద్ద మసీదు, సూర్యమహల్ దగ్గర, జి.టి రోడ్డు శ్రీకాకుళం.

నోటీస్

పై నెంబర్ దావాలో మీరు ఒకటవ ప్రతివాది అయి ఉన్నారు. మీరు వాదికి క్రాస్ ఎగ్జామినేషన్ చేయుట నిమిత్తము మీ హాజరు కొరకై **తేదీ 01-10-2024 న వాయిదా అయి ఉన్నది.** సదరు పై తేదీన **ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని వకీల్ ద్వారా గాని. హాజరై మీ వాదన తెలియపరచవలెను లేనియెడల మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానించడం జరుగును

// By order of the Honourable court //

పేరూరి నాగేశ్వరరావు
పిటిషనర్ తరుపున న్యాయవాది,
శ్రీకాకుళం,
సెల్: 9848950706.

CHANGE OF NAME

I, Undersigned **BHOGAPURAPU RAVINAIDU** (Old name) S/o. Late Lakshmi Narayana, R/o Door No.1-91, Pedda Street, Pasukudi Village, Bhamini Mandalam, Parvathipuram Manyam, District, AP-532456. Changing my name from **BHOGAPURAPU RAVINAIDU TO BOGAPURAPU RAVI NAIDU** (New Name) shall hence forth I am being called as **BOGAPURAPU RAVI NAIDU** (New name) For all Purpose.

CHANGE OF NAME

I, Undersigned **GELLANKI JYOTHI** (Old name) W/o. Bogapurapu Ravi Naidu, R/o Door No.1-91, Pedda Street, Pasukudi Village, Bhamini Mandalam, Parvathipuram Manyam, District, AP-532456. Changing my name from **GELLANKI JYOTHI** TO **BOGAPURAPU JYOTHI** (New Name) shall hence forth I am being called as **BOGAPURAPU JYOTHI** (New name) For all Purpose.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలో రూ.25 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అశోక్ సోమవారం శంకుస్థాపన చేశారు. పట్టణంలో 16 వార్డు పరిధిలో అర్ధాంతరంగా నిలిచిన రూ.15 లక్షల సిసి రోడ్డు, 21, 22 వార్డుల్లో రూ.పది లక్షలతో సిసి డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం బస్టాండ్ వద్ద కారు స్టాండ్ కొత్త గదిని ప్రారంభించారు.కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ ఛైర్మన్ భారతీదివ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిపి నాయకులు కళ్ల ధర్మారావు, నాగరాజు పాత్రో, నందిక జాని, సాలీనాఢిల్లీ, వార్డు కౌన్సిలర్లు పత్రీ తవితయ్య, కాళ్ల దిలీప్‌కుమార్, లీలారాణి, కమిషనర్ రమేష్, జయదేవ్, విశ్వనాథరెడ్డి, రెయ్యా జానకీరావు పాల్గొన్నారు.

ప్రజలను ముంచే ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- పాతపట్నం

తిరుపతి టిడిడి లడ్డూ ప్రసాదంపై తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం సిఎం చంద్రబాబు నాయుడు చేసిన తప్పుడు ఆరోపణ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది యాత్రికుల మనోభావాలను దెబ్బతీసిందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు వందరోజుల పాలనలో ఊహకు అందని విధంగా రాష్ట్రం సర్వనాశనమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఎన్నికల ముందు వాగ్దానాలు ఇచ్చి పథకాలు అమలు చేయకుండా కుంటి సాకులతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్న ఏకైక వ్యక్తి చంద్రబాబే అని వ్యాఖ్యానించారు. హత్యా రాజకీయాలు చేస్తూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

వంద రోజుల్లోనే ప్రజాభీష్ట పాలన

ప్రజాశక్తి- పోలాకి

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు వంద రోజుల పాలనలో ప్రజల అభీష్టం మేరకు వారిని అభివృద్ధి చేసేలా పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని గొల్లలవలసలో సోమవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వంద రోజులు అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరించారు. ముందుగా టిడిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం మొక్కలను నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మురళీధర్, మండల పార్టీ అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, రోనంకి కృష్ణంనాయుడు, జనసేన నియోజకవర్గ నాయకులు బి.ప్రవీణకుమార్, తహశీల్దార్ ఎం.సురేష్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ దేవరాజు పాల్గొన్నారు.

బూర్జ : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జనసేన, బిజెపి నాయకులతో కలిసి మండలంలోని అల్లెన గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా పథకాలు అందు తున్నాయని మహిళలు తెలిపారు. తమ గ్రామం నాగావళి నదికి అనుకొని ఉండడంతో విస్తారంగా వర్షాలు కురిస్తే గ్రామానికి వరద నీరు వచ్చే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. కరకట్టలు లేకపోవడం వలన ఆందోళన చెందుతున్నామని తెలిపారు. ముఖ్యంగా గ్రామంలో కాలువలు, రహదారి లేకపోవడం వంటి సమస్యలు వేధిస్తున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి, ఎడి రాజగోపాలం, ఎఒ శ్రీనివాసరావు, హౌసింగ్ ఎఇ లక్ష్మీనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు బి. సీతారాం బాబు నాయుడు, మాజీ

పోలాకి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఎమ్మెల్సీ పి.విశ్వప్రసాద్, మాజీ జెడ్‌పిటిసి ఎ.రామకృష్ణ, టిడిపి నాయకులు పైడి సత్యప్రసాద్, శ్రీరాములు నాయుడు, లంక జగన్మోహన్ నాయుడు, జడ్డు కృష్ణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : టిడిపి కూటమితోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని రత్తకన్నలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, పట్టణ అధ్యక్షుడు కాళ్ల ధర్మారావు, నందిక జాని, సాలీనా ఢిల్లీ, కొండ శంకర్ రెడ్డి, తహశీల్దార్ వెంకటరావు, కమిషనర్ రమేష్ పాల్గొన్నారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తన దృష్టిలో ఉందని, మొదటి ప్రాధాన్యతగా నీటి సమస్యను అతిత్వరలో పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులో పురుషోత్తపురంలో సోమవారం మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. మున్సిపాలిటీలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, కౌన్సిలర్ సప్ప అమ్మాజీ, మున్సిపల్ డిఇఇ కనకరాజు, డిటి లక్ష్మీనారాయణ ఐసిడిఎస్ పిఒ లావణ్య, ఆర్ఐ నిరంజన్ పాల్గొన్నారు.

అలాగే మండలంలోని బ్రహ్మణతర్లాలో వంద రోజులు సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు,. కార్యక్రమంల ఆళ్ల వెంకటరావు, వడ్డి యాదగిరి, ఆనందరావు, రఘుపాత్రుని సుదర్శనరావు, ఆళ్ల కృష్ణారావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : గార మండలంలోని బలరాంపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరయ్యారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని మెళియాపుట్టి, పెద్దలక్ష్మీపురం పంచాయతీల్లో వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలకు వివరించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం పనితీరు, సంక్షేమ పథకాల గురించి వివరించి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్‌రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు బసవ పరమేశ్వర్ రెడ్డి, రుషికేష్, రమేష్, కార్యదర్శి ప్రసాద్, సచివాలయ సిబ్బంది కిరణ్, సూర్య, లక్ష్మణరావు, తీర్దవేణి, బి.మీన పాల్గొన్నారు.

నౌపడ : టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నౌపడ విజయవంతంగా పూర్తి చేశారు. ప్రభుత్వ పనితీరును వివరిస్తూ పోస్టర్లను పంపిణీ చేశారు. యువ నాయకులు సుగ్గు శాంతి స్వరూపరెడ్డి, చెన్నూరు గౌరీశంకర్, వరప్రసాద్ బాబ్జి, మహంతి రాజు, బాలకృష్ణ, శంకర్, కార్యదర్శులు రాజు, ఉమాపతి, సచివాలయ సిబ్బంది వెంకటనారాయణ, గవరయ్య, కల్పన,

శ్రీకాకుళం రూరల్ : పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

బూర్జ : వరదకట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

రంజిత్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోగల హరిశ్చంద్రపురంలో మాజీ సర్పంచ్ పూజారి శైలజ ఆధ్వర్యాన వంద రోజుల అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు హనుమంతు అప్పలరాజు, ఉప్పాడ జయరాం, బిజెపి మండల అధ్యక్షుడు మెట్ట తిరుమలరావు, కోట నాగేశ్వరరావు, గంగిట్ల అప్పన్న, కార్యదర్శి బి. నరేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హిరమండలం : కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ముద్రించిన పోస్టర్లను మండలంలోని గొట్టలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిపి తూలుగు తిరుపతిలో మాస్టారు, పైల బాబ్జి, రామారావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆమదాలవలస: ప్రభుత్వం ఏర్పడి 100 రోజుల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఇది మా మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని 10వ వార్డు పాతినవారి వీధిలో టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి నాగళ్ల మురళీధర్ యాదవ్, బగాన అమ్మినాయుడు, పాతిన రమణమూర్తి ఉన్నారు. అలాగే మండలంలోని దన్నాన పేటలో ఎంపిటిసి గొర్లె సూర్యం, టిడిపి యువ నాయకుడు రాము ఆధ్వర్యంలో ఇది మా మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.

జి.సిగడాం : మండలంలోని పెంట గ్రామంలో టిడిపి నాయకుడు మక్కా నారాయణరావు ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పోస్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మీకోసం కార్యక్రమంలో ప్రజలు అందించిన ఫిర్యాదుల సమస్యలను పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి చట్ట పరిధిలో పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలని జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా 85 మంది ఫిర్యాదుదారుల నుంచి ఎస్‌పి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. నిర్ణీత సమయంలో నివేదికను కార్యాలయానికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కంటిచూపుపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

నేత్రాలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కంటి చూపుపై నిర్లక్ష్యం వహించద్దని, కంటి చూపు సక్రమంగా ఉన్నప్పుడే ఒకరిపై ఆధారపడకుండా జీవించే ఆస్కారం ఉంటుందని టిడిపి నాయకులు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ హేమబాబు చౌదరి అన్నారు. మండలంలోని చినవంక పంచాయతీలో శంకర్ ఫౌండేషన్ నేత్ర ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణా సంస్థ ఆధ్వర్యాన సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆప్తాలమిక్ అరుణ్‌కుమార్ 80 రోగులకు నేత్రాలను పరీక్షించి, 40 మందిని ఆపరేషన్‌కు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్ర శస్త్ర చికిత్సలు అనగానే భయపడవలసిన అవసరం లేదని అన్నారు. అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉండడంతో కేవలం పది నుంచి 15 నిమిషాల్లో నేత్ర చికిత్స పూర్తవుతుందని తెలిపారు. శస్త్ర చికిత్స నిర్వహించుకున్న రోగులు వైద్యుల సూచనలు పాటిస్తే త్వరగా కోలుకుంటారని అన్నారు. శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు, మందులు పంపిణీ చేస్తారని, అలాగే కళ్లద్దాలు అందజేస్తారని చెప్పారు. అనంతరం రోగులకు పళ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

పౌష్టికాహారం ఆరోగ్యానికి మేలు

కొత్తూరు: పౌష్టికాహారం తీసుకుంటే గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని కుంచాలపేట సత్యసాయి కళ్యాణ మండపంలో పౌష్టికాహార మాసోత్సవాలు సోమవారం నిర్వహించారు. కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల సెక్టార్ అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. వివిధ పిండి వంటకాల స్టాల్స్‌ను పరిశీలించి రుచులను చూశారు. సిడిపిఒ యువిమలా కుమారి, బాలల హక్కుల సంరక్షణ సంఘం డైరెక్టర్ కొత్తకోట శ్రీనివాసరావు, న్యూరాలజిస్టు డాక్టర్ సునీత, సూపర్‌వైజర్లు శాంతిశ్రీ, సుధారాణి, సరస్వతి, సీనియర్ అసిస్టెంట్ జగన్నాథ్, టిడిపి నాయకులు ఎ.అరుణ్‌కుమార్, కె.సంజీవరావు, ఎల్.తాతబాబు, ఎ.మాధవరావు, ఎ.దశరథ పాల్గొన్నారు.

పిండి వంటకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

వివరాలను వెల్లడిస్తున్న సిఐ చిన్నంనాయుడు

గంజాయితో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అక్రమంగా గంజాయి తరలిస్తున్న శంకర సాహును అరెస్టు చేశామని సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఈ మేరకు స్టేషన్‌లో సోమవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం కందమాల్ జిల్లా నుంచి అక్రమంగా 10.470 కేజీల గంజాయి బ్యాగ్‌లో తరలిస్తుండగా పట్టణ పోలీసులు పట్టుకున్నారని అన్నారు. ఎల్ సిగేట్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న శంకర్ సాహును అదుపులో తీసుకొని తనిఖీలు చేయగా, బ్యాగ్‌లో గంజాయి ఉందని చెప్పారు. ఒడిశాలో కొనుగులు చేసిన గంజాయిను గుంటూరులో అధిక ధరలకు అమ్మేందుకు తరలిస్తున్నారని తెలిపారు. గంజాయి రవాణా, అమ్మకాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ చిన్నంనాయుడు పాల్గొన్నారు.

తమ్మినేనితో కృష్ణదాస్ భేటీ

తమ్మినేనిని మర్యాదపూర్వకంగా కలిసిన కృష్ణదాస్

ఆమదాలవలస : మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంతో వైసిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. సోమవారం పట్టణంలోని తమ్మినేని సీతారాం స్వగృహంలో ధర్మాన కృష్ణదాస్ ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఇటీవల శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ పరిశీలకుడిగా తమ్మినేని సీతారాంను నియమించడంతో కృష్ణదాస్ సీతారాంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతమే లక్ష్యంగా సమిష్టిగా ఐక్యతతో పనిచేద్దామని కృష్ణదాస్ సీతారాంను కోరారు. ఇటీవలే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లో ఎండగడుతూ, ప్రజల పక్షాన ఉండి పోరాటాలను కొనసాగిద్దా మని తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. కార్యక్రమంలో డిసిసిబి బ్యాంక్ మాజీ అధ్యక్షులు కరిమి రాజేశ్వరరావు, నరసన్నపేట ఎంపిపి ఆరంగి మురళీధర్, నరసన్నపేట వైసిపి మండల పార్టీ అధ్యక్షులు లుకలాపు రవి, పొందర కుల అధ్యక్షులు ఆర్.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గౌతు శిరీష

మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే శిరీష

పలాస : మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ తిలక్ నగర్‌లో రూ. 4 లక్షల వ్యయంతో నిర్మాణం చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకతీతంగా మున్సిపాలిటీ పరిధిలోని అన్నీ వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన మూడు నెలల్లో కాలువలో పూడికలు తీసేందుకు రూ.42 లక్షల నిధులు మంజూరు చేయించి పూడికలను తొలగించామన్నారు. ఎంతో మందికి అన్నం పెట్టే అన్న క్యాంటీన్ ప్రారంభించామని తెలిపారు. మున్సిపాలిటీలో వీధి దీపాలు, సిసి రోడ్లు, కాలువలు నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు అయ్యేలా చూస్తామన్నారు. మున్సిపాలిటీలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

మొక్కలు నాటాలి

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. స్థానిక ఎర్ర చెరువు గట్టుపై టిడిపి నాయకులతో కలిసి మొక్కలను నాటారు. అంతకు ముందు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, దడియాల నర్సింహులు, మల్లా శ్రీనివాసరావు అంబటి కృష్ణమూర్తి, కొండే నర్సింహులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరం

పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరమని, తల్లి పాలు తాగడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని పురుషోత్తపురంలో ఐసిడిఎస్ ఆధ్వర్యాన పోషణ మాసోత్సవాలు కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం పౌష్టికాహారం పంపిణీ చేస్తుందన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు పోషక ఆహారాన్ని తినిపించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ లావణ్య, సూపర్‌వైజర్ గంగమ్మ, అంగన్వాడీ కార్యకర్త జ్యోతి పాల్గొన్నారు.

వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి- బూర్జ

పార్వతి (ఫైల్)

మండలంలోని మదనాపురానికి చెందిన ఈపి పార్వతి (58) మతిస్థిమితం లేక ఆదివారం రాత్రి మృతి చెందింది. కుమారుడు గణేష్ వివరాల మేరకు తన తల్లి పార్వతికి గత కొంతకాలంగా మతిస్థిమితం లేక గ్రామాల్లో పలుచోట్ల సంచరిస్తుందని ఆదివారం తాము ఎవరి పనులపై వారు బయటికి వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేసరికి అమ్మ కనిపించక పోవడంతో గ్రామ సమీపంలో ఉన్న అన్ని ప్రాంతాల్లో గాలించగా గ్రామ పొలిమేరలో ఉన్న మంచినీటి బావికి దగ్గరలో సిఎస్‌పి రోడ్డు పక్కన తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో అపస్మారక స్థితిలో పడి ఉందని, వెంటనే ప్రైవేటు వాహనంలో శ్రీకాకుళం ఆస్పత్రికి తరలిస్తుండగా బూర్జ జంక్షన్ వద్ద ఆమె మరణించినట్టు తెలిపాడు. తన తల్లి పార్వతి తల, శరీరంపైన తీవ్రంగా గాయాలుండడంతో రోడ్డు ప్రమాదానికి గురి కావడం, లేదా మతిస్థిమితం లేక పడిపోవటం వలన గాయపడి ఉంటుందని పోలీసులకు కుమారుడు గణేష్ ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ ఎం.ప్రవళ్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

సోంపేట : మండలంలోని కొర్లం పంచాయతీ పరిధి అగ్రహారం చెరువు ఆయకట్టు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు తహశీల్దార్ అప్పలస్వామిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు వారసత్వంగా సంక్రమించిన భూములు తమవి కావు అంటూ వాటి రిజిస్ట్రేషన్ కార్యకలాపాలను నిలుపుదల చేయడం సరికాదని, విచారణ చేపట్టి తమకు న్యాయం జరిగేలా చూడాలని వారంతా కోరారు. ఏళ్ల తరబడి భూముల క్రయవిక్రయాలు జరిగాయని, వాటికి ఇప్పుడు రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో రైతులు జానకిరావు, బాలరాజు, బాబూరావు, జోగారావు, తుంగనాథం, అప్పన్న పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న రైతులు

లావేరు ఎంఇఒ మృతి

ప్రజాశక్తి- లావేరు

లావేరు పంచాయతీ జి.జి.వలసకు చెందిన లావేరు మండల విద్యాశాఖ అధికారి లండ ఈశ్వరరావు (46) సోమవారం వేకువజామున రణస్థలం ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఈశ్వరరావు గతంలో రణస్థలం ఎంఇఒగా పనిచేస్తూ అనంతరం 2016లో లావేరుకు బదిలీపై వచ్చి సుదీర్ఘంగా ఎంఇఒగా కొనసాగుతున్నారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది కోలుకున్న అనంతరం విధులకు హాజరవుతూ పాఠశాలలు తనిఖీ చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేశారు. ఎంఇఒ మరణ వార్తతో పలువురు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన భార్య తులసి గ్రామ సచివాలం ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఇద్దరు కుమారులు శశి, శశాంక్, తల్లిదండ్రులు ఉన్నారు.

ఎమ్మెల్యే సంతాపం

ఎంఇఒ మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు జి.జి.వలస వెళ్లి ఎంఇఒ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. డిఇఒ, డిప్యూటీ డిఇఒలు తిరుమల చైతన్య, విజయకుమారి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. టిడిపి మండల అధ్యక్షుడు ముప్పుడి సురేష్, ఎఎంసి మాజీ ఛైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, లావేరు, రణస్థలం ఎంపిపి ప్రతినిధులు రొక్కం బాలకృష్ణ, పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసిలు మీసాల సీతంనాయుడు, టి.సీతారాం, పలువురు ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు నివాళ్లర్పించి సంతాపం వ్యక్తం చేశారు.


నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు
(ఇన్‌సెట్‌లో ఈశ్వరరావు (ఫైల్)

సమస్యలు పరిష్కరిస్తా...

కోటబొమ్మాళి: వివిధ సమస్యలు, పనుల కోసం తన దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తానని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడలో తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ మేరకు టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళి మండలాల ప్రజలు వచ్చి వినతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీ గ్రామాల్లో సమస్యలు విడతల వారీగా పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కల్లి నాగయ్యరెడ్డి, లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి- నందిగాం

మహాలక్ష్మి (ఫైల్)

మండలంలోని కవిటి అగ్రహారం మాజీ సర్పంచ్ రొణగల మహాలక్ష్మి (61) సోమవారం మృతి చెందారు. ఈమె 1999 నుంచి 2004 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. ఈమె భర్త రొణగల సన్యాసి టిడిపి కార్యకర్తగా క్రియాశీలంగా పనిచేస్తున్నారు. ఈమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈమె మృతిపై మాజీ సర్పంచ్‌లు బంగారి బారికి, పిట్ట రామారావు, గ్రామస్తులు బంగారి శివ, పిట్ట నరసింహమూర్తి, మద్దిల షణ్ముఖ, బడే తిరుపతి, బంగారి బాలయ్య సంతాపం వ్యక్తం చేశారు

నిలిచిన కళ్లద్దాల పంపిణీ

ప్రజాశక్తి- పాతపట్నం

పేదలకు నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లద్దాలు ఇచ్చే ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రం మూతపడడంతో పేద ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నేత్ర పరీక్షలు చేయించుకున్న తర్వాత కళ్లద్దాల కోసం రూ.వెయ్యి నుంచి రూ.15 వందల చెల్లించాల్సి వస్తుందని రోగులు గగ్గోలు పెడుతున్నారు. పాతపట్నం సామాజిక ఆస్పత్రిలో 2018 నుంచి ఉచిత కళ్లద్దాల పంపిణీ కేంద్రం అమలయ్యేది. టిడిపి కూటమి ప్రభుత్వం హఠాత్తుగా ఇది కళ్లద్దాలు పంపిణీ నిలిపివేయడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేయాలని కోరుతున్నారు.

ఆక్రమణ అడ్డుకోవాలని ఫిర్యాదు

ఆక్రమణలపై ఫిర్యాదు చేస్తున్న రైతులు

ప్రజాశక్తి- పొందూరు

మండల కేంద్రంలోని సీతమ్మ చెరువు పక్కన గల 122, 123 సర్వేనెంబర్‌లో ఉన్న రస్తాలో ఆక్రమణలను అడ్డుకోవాలని పలువురు రైతులు సోమవారం జిల్లా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం చెరువులు, వాగులు, రస్తాలు ఆక్రమణలకు గురి కాకుండా చూడాలంటూ ఇచ్చిన తీర్పును ఇక్కడి అధికారులు బేఖాతరు చేస్తున్నారంటూ జెసికి తెలిపారు.

దీనిపై తమకు పట్టా ఉందని, పట్టా ఆధారంగా తమకు భూమి అప్పగించాలంటూ కొందరు ఎఫ్‌లైన్ కట్టి తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. దీంతో పట్టా ఇచ్చిన భూమి రస్తా అని రైతులు కోర్టుకు వెళ్లగా దీనిపై సమీక్షించాలని కోర్టు రెవిన్యూశాఖను ఆదేశించింది. ఇటీవల రెవిన్యూ, సర్వే అధికారులు ఈ సర్వేనెంబర్‌లో సర్వే జరిపారు. రస్తాలో ఇచ్చిన పట్టాను రద్దు చేయాలంటూ పలువురు రైతులు జెసి దృష్టికి తీసుకువెళ్లగా సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ఇచ్చిన పట్టాపై నివేదిక ఇవ్వాలని పొందూరు తహశీల్దార్‌ను ఆదేశించినట్లు రైతులు తెలిపారు.

పలువురు ఆర్థికసాయం

నౌపడ : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

నౌపడ: సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర పంచాయతీ గొల్లసీతాపురానికి చెందిన అవయవదాత బొమ్మాళి బాలరాజు కుటుంబానికి అభయం సేవా సంఘం రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. టెక్కలిలో ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభంపై నుంచి పడి బ్రెయిన్ డెడ్ అయిన బాలరాజు అవయవాలను ఇటీవల కుటుంబ సభ్యులు దానం చేసారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న అభయం సేవా సంఘం విరాళాలు సేకరించారు. ఈ మేరకు సోమవారం బాధితుల ఇంటికి వెళ్లి అతని భార్యకు నగదు అందజేశారు. దీనిలో చర్మ వైద్యులు లింగాల రమేష్ రూ. పది వేలు విరాళం ఇచ్చారు. అభయం యువజన సేవా సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు, సెక్రటరీ లాడి కామేశ్వరరావు, ట్రెజరర్ శ్రీనివాస్ బెహరా, సంఘ సభ్యులు ధర్మవరపు పూర్ణాచారి, పిల్లల రమేష్, అద్దాల వీరభద్రాచారి, ఉంగరాల గోవిందరావు షణ్ముఖ పట్నాయక్, బోయిన నాగరాజు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని అమలపాడులో బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న దున్న సింహాచలానికి యువతరం సేవా సమితి సభ్యులు సోమవారం రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. సింహాచలం రెండు నెలల క్రితం బతుకు తెరువు కోసం రష్యా వెళ్లాడు. అక్కడ పనిచేస్తుండగా... అకస్మాత్తుగా కళ్లు తిరిగి కుప్పకూలిపోయాడు. అక్కడి సిబ్బంది వెంటనే ఆస్పత్రిలో చేర్పించారు. మెదడులో రక్తం గడ్డకట్టిందని అక్కడి వైద్యులు నిర్ధారించారు. శస్త్ర చికిత్స వికటించడంతో ప్రస్తుతం అతని కుడి కాలు, చేయి, నోరు పనిచేయడం మానేశారు. దీంతో బాధితుడికి భార్యకు నగదు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు చింత మురళి, కర్ని లింగరాజు, గోరకల సునీల్, బత్తిని విగ్నేశ్వరరావు, లోకేశ్వరరావు, గున్న వెంకటరమణ, కర్ని సోమేశ్వరరావు పాల్గొన్నారు.

కమిషనర్ బాధ్యతల స్వీకరణ


రామారావు

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్‌గా ఎన్.రామారావు కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో శానటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు పలాస-।కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. గతంలో పనిచేసిన కమిషనర్ టి.నాగేంద్రకుమార్ కొవ్వూరు కమిషనర్‌గా బదిలీపై వెళ్లిపోయారు. నూతన కమిషనర్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

డిఇకి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

లైన్‌మెన్‌ను నియమించాలని వినతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని ఇలైపురం సచివాలయానికి జూనియర్ లైన్‌మెన్‌ను సర్పంచ్‌లు కోరారు. ఈ మేరకు టెక్కలి విద్యుత్ శాఖ డిఇ శంకరరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలైపురం సచివాలయ పరిధిలో ఆంపురం, ఇలైపురం, గొట్టిపల్లి గిరిజన పంచాయితీలు ఉన్నాయని తెలిపారు. 16 గిరిజన గ్రామాలు ఉన్నాయని, లైన్‌మెన్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆంపురం, ఇలైపురం, గొట్టిపల్లి సర్పంచ్‌లు డి.జమ్మయ్య, సిద్ధిపాలెం గౌరీష్, ఎస్.జనార్ధన్ పాల్గొన్నారు.

చిన్నారులతో మాట్లాడుతున్న ఎంఇఒ అప్పారావు

పాఠశాల తనిఖీ

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీలోని ముత్యాలమ్మపేట ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ అప్పారావు సోమవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ వార్షిక తనిఖీలు పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు కూలంకుశంగా పరిశీలించారు. ఈ పరిశీలనలో విద్యార్థుల అభ్యసన స్థాయిని, పఠణా సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో అన్నిరకాల నిర్వహణ రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని రుచు చూశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖరం, సుభాష్‌చంద్ర, ప్రకాష్‌రెడ్డి, సిఆర్‌పిలు సత్యనారాయణ, దేవరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణ

డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం స్థానిక పట్టణంలో నిర్వహించారు. సంఘ నూతన అధ్యక్షునిగా వజ్జ కృష్ణారావు, కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు కమిటీ సభ్యులనూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వి.ప్రభాకరరావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సుమారు 50 ఏళ్ల పాటు డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్‌కు సేవలందించిన సిందిరి కృష్ణారావు, పాండవ రుషికేశ్వరరావులను సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు పైడిశెట్టి రమేష్‌కుమార్, మంచు ప్రదీప్, పెద్దింటి దుర్యోధన, తుంగాన వెంకటేష్ పాల్గొన్నారు.

పుస్తకాలను అందజేస్తున్న సతీష్‌కుమార్

వైస్ ప్రిన్సిపాల్ ఔదార్యం

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. కళాశాలలో బిఎస్‌సి తృతీయ సంవత్సరం చదువుతున్న 30 మంది విద్యార్థులకు రసాయనిక శాస్త్ర విభాగానికి సంబంధించి పర్యావరణ రసాయన శాస్త్ర పుస్తకాలను సోమవారం అందజేశారు. సతీష్‌కుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ, అధ్యాపకులు అభినందించారు.

సబ్ రిజిస్ట్రార్ బదిలీ

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న కె.వేణు రాజాం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. రణస్థలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి విశాఖపట్నం జిల్లా భీమిలీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ తులసీ దాస్ రెడ్డి బదిలీపై వస్తున్నారు. తులసీ దాస్ రెడ్డి మంగళవారం విధుల్లో చేరనున్నట్లు తెలిపారు. అలాగే రణస్థలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న మిగతా సిబ్బంది కుడా బదిలీపై వెళ్తున్నారు.

తోటపాలెంలో అన్నదానం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని తోటపాలెంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్-ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని గోరింట, దల్లవలసలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి బెండి బాబ్జీ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో పంటల సాగుకు సంబంధించిన పలు సూచనలు, సలహాలను రైతులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల రైతులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఉండి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

టెక్కలి : రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ ఫ్లెక్సీని చింపివేసి అవమానపర్చిన ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షులు చల్లా రామారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంబేద్కర్ ఫ్లెక్సీ చింపివేయడం ఉద్దేశపూర్వక చర్య అని అన్నారు. దీనిని సంఘ విద్రోహ చర్యగా భావించి కృష్ణంరాజును అరెస్టు చేయాలని కోరారు.

గురుకులంలో పోషణ్ అభియాన్

పాతపట్నం : స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పోషకాహారంతో కూడిన ఆహారాన్ని ప్రతిఒక్కరూ తీసుకోవాలని ప్రిన్సిపాల్ వి.అర్చన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వి.సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్య భద్రత

ఎచ్చెర్ల : కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ బాలాజీ, విద్యార్థులు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య భద్రత ఉంటుందని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని కొండములగాం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారికంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగు తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, మాజీ జెడ్‌పిటిసి గొర్లె లక్ష్మణరావు, కూటమి నాయకులు పిసిని జగన్నాధం నాయుడు, లెంక ప్రభ, వెలిచేటి సురేష్ కుమార్, ముప్పిడి సురేష్, శ్రీనివాసరావు, దన్నాన సత్తిబాబు, స్వామినాయుడు, తహశీల్దార్ ఎన్.ప్రసాదరావు, ఎంపిడిఒ ప్రకాశరావు, వైద్యులు ప్రసన్నలక్ష్మి, లలిత, కె.రత్నకుమార్, పద్మావతి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నరసన్నపేట: పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం పారిశుధ్య కార్మికుల నిర్వహించిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులకు టిడిపి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. పారిశుధ్య కార్మికులు చేపట్టిన సేవలు వెలకట్టలేనిదన్నారు. అనంతరం ఆయాష్మాన్ భారత్ హెల్త్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బలగ ప్రవీణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనుబాబు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సంతోష్, ఎంపిడిఒ మధుసూదనరావు, మండలం పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి జి.చిట్టిబాబు, జిల్లా లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి రోనంకి కృష్ణంనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బైరి భాస్కరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు కింజరాపు రామారావు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, మాజీ సర్పంచ్ ఊన్న రాజశ్రీ పాల్గొన్నారు.

పోలాకి: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పోలాకి పిహెచ్‌సిలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వైద్య పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బలగ ప్రవీణ్ కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి యోగ హరి, లవేటి బొజ్జమ్మ పాల్గొన్నారు.

పాతపట్నం: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని బిజెపి నాయకులు సిరిపురం తేజేశ్వరరావు ప్రారంభించారు. గైనకాలజిస్టు అనిత, అరోథపెడిక్ షణ్ముఖరావు, వైద్యులు సునీత రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.కృష్ణారావు, తాడేలా భూపతి, బాబూరావు, వెంకటరమణ, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పోలాకి : వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఎచ్చెర్ల: పర్యావరణ పరిరక్షణపై ఆర్‌జియుకెటిలో ఎన్ఎస్ఎస్ యూనిట్ -6 అధికారి డాక్టర్ రాకోటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ ఆచార్య బాలాజీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతన్నారు. ఎన్ఎస్ఎస్ వసతిగృహ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎఒ ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ రవి, ఫైనాన్స్ ఆఫీసర్ మోహనరావు, అధ్యాపకులు డాక్టర్ ముకుంధరావు, సింహాచలం, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని తిర్లంగిలో సోమవారం రెవెన్యూ అధికారులు ఆక్రమణలను తొలగించారు. గ్రామంలోని సర్వే నంబరు 89/20లో కాలువపై చేపట్టిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. ఇటీవల రెవెన్యూ అధికారులు ఆక్రమణలను తొలగిస్తున్న క్రమంలో ఉద్రిక్తత నెలకొన్న విషయం విదితమే. కాగా ఈ మేరకు తాజాగా సోమవారం తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి తన సిబ్బంది, పోలీసుల పర్యవేక్షణలో ఆక్రమణలను తొలగింపు చర్యలు చేపట్టారు. ఇంటి యజమాని ఇంట్లోనే ఉన్నారు. ఈ సమయంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు బయటకు పంపించి తొలగించారు.

కక్షసాధింపు చర్య

టిడిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందనిఇంటి యజమాని సావుకారి నీలకంఠేశ్వరరావు అన్నారు. ఈ ఏడాది ఎన్నికల్లో వైసిపితో పనిచేయడంతో టిడిపి నాయకులు కక్ష కట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే గత 30 ఏళ్లుగా నివాసం ఉంటున్నానని, కాలువ వాడుక లేదని, అయినా కాలువపై తొలగించడానికి సిద్ధపడ్డారని అన్నారు.

తొలగిస్తున్న ప్రొక్లెయినర్

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ సూదికొండ సమీపం సూర్యకాలనీలో కక్షపూరితంగా గత ప్రభుత్వం సిసి రోడ్డు వేయలేదని మాజీ కౌన్సిలర్, టిడిపి మహిళా నాయకులు వజ్జ గంగా భవానీ అన్నారు. ఈ మేరకు సూర్యకాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని సోమవారం మట్టి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం హయాంలో సూర్య కాలనీలో నివాసం ఉటున్న కొంతమంది గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి కౌన్సిలర్‌గా పోటీచేసిన తనకు ఓట్లు వేశారని, టిడిపికు ఓట్లు వేసినందుకు వైసిపి ప్రభుత్వం కక్షపూరితంగా రోడ్లు వేయకపోవడం దారుణమని మండిపడ్డారు. చిన్నపాటి వర్షం కురిస్తే కాలనీ అంతా అధ్వానంగా తయారవుతుందోని, కాలనీ వాసులు బయటకు రాలేని పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు కాలువ నిర్మించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని, దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. కాలనీ సమస్యలపై ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

పరిశీలిస్తున్న గంగాభవానీ

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- మందస

ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ చిట్టిపాటి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని రట్టిలో ఈ సభకు న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల. మాధవరావు అధ్యక్షతన చంద్రక్క 4వ వర్ధంతిని సోమవారం నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్దానం ప్రజలకు ఉద్యమాల కొత్త కావని, ఈ ఉద్దానమంతా ఎర్ర పూలవనంగా వికసించి అప్పట్లో ఈ ప్రాంతంలో ప్రజల సమస్యలు అనేకం పరిష్కారమయ్యాయని అన్నారు. తీర ప్రాంతంలో మత్స్యకార, ఉద్దానం రైతాంగానికి గిట్టుబాటు ధర సమస్యలు ఇప్పటికీ అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. వీటి పరిష్కారానికి మళ్లీ ప్రజలందరూ పోరుబాట పట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, కె.సోమేశ్వరరావు, పిడిఎస్యుయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్, రైతు కూలీ సంఘం నాయకులు మామిడి భీమారావు, వంకల పాపయ్య, బంగ్లాకుమార్, తాతారావు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

విద్యార్థులకు ప్రమాణ పత్రాలు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బెజ్జిపురం జెడ్‌పి పాఠశాలలో హిందీ మంచ్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం హిందీ పక్షోత్సవాలు హిందీ మంచ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంపివలస రామారావు ఆధ్వర్యంలో హిందీ దివస్ సభ పాఠశాల హెచ్‌ఎం ఎస్.రమణ అధ్యక్షతన నిర్వహించారు. హిందీ సులేఖన్ పఠన వ్యాసరచన నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. హిందీ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రమాణ పత్రాలు అందజేశారు. అలాగే ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న హెచ్‌ఎం రమణను సన్మానించారు. కార్యక్రమంలో హిందీ పండిట్ భరాటం దమయంతి, ఉపాధ్యాయులు కిరణ్ కుమార్, చిరంజీవి, గోపాలరావు, నీలాద్రి, సుధాకర్, వెంకటరావు, పద్మావతి, సుశీల, ఝాన్సీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రమాణ పత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఎంఎంఎస్ అధ్యక్షులుగా లక్ష్మి

ప్రజాశక్తి- జి.సిగడాం

స్థానిక మండల మహిళా సమైక్య భవనంలో సోమవారం ఎపిఎం రెడ్డి రామకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో మహిళా సంఘ సభ్యులకు ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతవురిటి గ్రామానికి చెందిన చిర్రా లక్ష్మి అధ్యక్షురాలుగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలుగా కోరాడ వాణిశ్రీ, కోశాధికారిగా లెంక ఉమ, కార్యదర్శిగా అల్లు గౌరీ, ఉప కార్యదర్శిగా లంక జ్యోతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎపిఎం తెలిపారు. సమావేశంలో ప్రాజెక్టు ప్రాధాన్యత అంశాలు, వంద రోజుల యాక్షన్ ప్లాన్, 2024- 25 భవిష్యత్ ప్రణాళికలపై వివరించారు. కార్యక్రమంలో గ్రామ సంఘ అధ్యక్షులు, సిసిలు, అకౌంటెంట్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఎపిఎం

సమీకృత దాణాతో పాల ఉత్పత్తి

కోటబొమ్మాళి: పశువులకు సమీకృత దాణా వాడటం వల్ల పాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని, పశువులు ఆరోగ్యకరంగా ఉంటాయని టెక్కలి డివిజనల్ పశువైద్య ఉప సంచాలకులు డాక్టర్ వి.జయరాజు అన్నారు. మండలంలోని నిమ్మాడలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్ సమక్షంలో పాడి రైతులకు సమీకృత దాణాను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని పంచాయతీలకు విడతల వారీగా ఈ దాణాని అందిస్తామని, 200 కిలోల ఈ దాణా ఖరీదు రూ.3160లు ఉంటే... ప్రభుత్వం సబ్సిడీతో రూ.1300లకే అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి ప్రాంతీయ ఆస్పత్రి సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.లోకనాథం, కురుడు పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్, తిలారు పశువైద్యాధికారి డాక్టర్ ప్రజ్ఞచైతన్య పాల్గొన్నారు.

దాణాను పంపిణీ పంపిణీ చేస్తున్న హరివరప్రసాద్

శిథిలావస్థలో డబారు పాఠశాల

ప్రజాశక్తి- మందస

మండలంలోని దబారు ప్రాథమికోన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. ఈ పాఠశాలలో 15 మంది చిన్నారులు చదువుతున్నారు. శిథిలావస్థకు చేరుకోవడంతో శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. చిన్న పాటి వర్షానికే పాఠశాల తడిచి ముద్దవుతుంది. వర్షం కురిసే సమయంలో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. 1995లో ప్రారంభించిన పాఠశాలకు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెచ్చులూడిన శ్లాబ్ పైకప్పు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జెవై స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

పలాస: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా నడిపిస్తున్న జెవై స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌డిఒ భరత్ నాయక్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జెవై స్కూల్ ఎటువంటి రిజిస్ట్రేషన్ లేకుండా పలాస, సోంపేట, శ్రీకాకుళంలో నడుపుతున్నారని అన్నారు. కనీసం అర్హత లేని ఉపాధ్యాయులతో పాఠాలు బోధించి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. విద్యార్థులకు ఆట స్థలం లేకుండా, కనీసం మౌలిక సదుపాయాలు కల్పించకుండా విచ్చలవిడిగా వేలాది రూపాయలు వివిధ కోర్సుల పేర్లు చెప్పి విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి వసూలు చేస్తున్నారని అన్నారు. తక్షణమే జెవై స్కూల్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు పవన్ జస్వంత్, మని పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టీ

ప్రజాశక్తి - విశాఖపట్నం

దీపావళి పండగ వస్తున్న నేపథ్యంలో బాణసంచా పేలుళ్ల సంభవించకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ పరిధిలోని జిల్లాల ఎస్‌పిలను డిఐజి గోపీనాథ్ జట్టీ ఆదేశించారు. బాణసంచా నిల్వలు, తయారీ, విక్రయాలు చేసే వారిపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, నిఘా ఏర్పాటు చేయాలన్నారు. బాణసంచా నిల్వలు, విక్రయాలు, తయారీ చేసే అనుమతులున్న గోడౌన్లు, షాపుల వద్ద భద్రతా ప్రమాణాలు, రక్షణ చర్యలు చేపడుతున్నదీ, లేనిది పరిశీలించాలని ఆదేశించారు. ఇతర శాఖల అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించాలన్నారు. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు, నిల్వలు, తయారీ చేపట్టే వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో అనధికారంగా బాణసంచా తయారీ, విక్రయాలు, నిల్వలు చేపట్టే వారిని ముందుగా గుర్తించి, బైండోవరు చేయాలని ఆదేశించారు.

వ్యాపారులు పాటించాల్సిన ముఖ్య సూచనలు

- బాణసంచా నిల్వలు, తయారీ, విక్రయాలు చేసే వారి వద్ద తప్పనిసరిగా అనుమతులు కలిగి ఉండాలి.
- బాణసంచా గోడౌన్లు, షాపులు, తయారీ కేంద్రాలు నివాస ప్రాంతాలకు నిర్దిష్ట దూరంలో ఉండాలి.
- ఫైర్ సేఫ్టీ ప్రికాషన్స్ అన్నింటిని తప్పనిసరిగా పాటించాలి.
- అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి
- ప్రతీ దుకాణం వద్ద అగ్ని నిరోధక సిలెండర్లు, తగినంత పొడి ఇసుక, కావాల్సిన నీరు అందుబాటులో ఉండాలి.
- మైనర్లను బాణసంచా నిల్వ, తయారు, విక్రయాలు చేసే కేంద్రాలు వద్ద పనుల్లో వినియోగించ కూడదు.
- లైసెన్సు కలిగివ్ను విక్రయదార్లు లైసెన్సు లేని వ్యాపారులకు విక్రయించి, తద్వారా ఏదైనా ప్రమాదం సంభవిస్తే,దానికి లైసెన్సు దారులే బాధ్యత వహించాలన్నారు.
- అనుమతి పొందిన దుకాణదారులు అధికారులు సూచించిన సమయం వరకు మాత్రమే విక్రయాలు నిర్వహించాలి.

ఆదమరిస్తే అంతే..!

ప్రజాశక్తి- లావేరు

కొత్తకోట నుంచి బట్టుపాళెం, గురుగుబిల్లి మీదగా మండల కేంద్రం లావేరు వెళ్లే రహదారి నరకాన్ని తలపిస్తుంది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి గురుగుబిల్లి గెడ్డ సమీపంలో గెడ్డ ప్రవాహానికి రహదారి కొట్టుకుపోయి బారి గుంతలు పడింది. రహదారికి ఇరువైపులా రెండు పెద్ద గుంతలు పడటంతో ఈ రహదారి గుండా రోజు సుమారు 15 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. సైకిల్, మోటార్ సైకిల్‌పై వెళ్లే వారు రెండు గుంతల మధ్య నుంచి చాకచక్యంగా వెళ్లాల్సి వస్తుంది. పొరపాటున ఆటో ఇటో వాహనం అదుపు తప్పితే పక్కనే ఉన్న లోతుగా ఉన్న గెడ్డలోకి పడే ప్రమాదం పొంచివుంది. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేసి గుంతలు పూడ్చి ప్రమాదాలను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

గురుగుబిల్లి గెడ్డ సమీపంలో ప్రమాదకరంగా కొత్తకోట - లావేరు రహదారి

'పబ్లిక్ ఫైనాన్స్' కోర్సు ప్రారంభం

శ్రీకాకుళం: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బిఎ ఐదో సెమిస్టర్ విద్యార్థినులకు పబ్లిక్ ఫైనాన్స్ సర్టిఫికేట్ కోర్సును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ పబ్లిక్ ఫైనాన్స్ అనేది దేశం రాబడి, వేతన, రుణభారం నిర్వహణ తదితర అంశాలతో కూడి ఉంటుందన్నారు. ఇటువంటి అంశాలతో కూడిన సర్టిఫికెట్ కోర్సు బిఎ విద్యార్థినులకు ఎంతో అవసరమన్నారు. వైస్ ప్రిన్సిపల్ పి.శంకరనారాయణ, ఆర్థికశాస్త్ర విభాగాధిపతి టి.ఆదిలక్ష్మి, కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్.కృష్ణారావు, ఐక్యుఎసి కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, ఆర్థికశాస్త్ర అధ్యాపకులు బి.ప్రభాకరరావు, కామర్స్ విభాగాధిపతి ఎల్.కృష్ణారావు పాల్గొన్నారు.

29న జిల్లాస్థాయి యోగాసన పోటీలు

శ్రీకాకుళం: జిల్లాస్థాయి యోగాసన పోటీలను ఈనెల 29న శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కాలేజ్‌లో నిర్వహించనున్నట్లు నేషనల్ యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నగరంలోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి యోగా అవసరమన్నారు. యోగాతో ప్రపంచం మొత్తం భారతదేశం వైపు చూస్తోందని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు 9676472733, 94922 66889, 94911 54156 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కేదారనాథ్, జాయింట్ సెక్రటరీలు జి.అర్చన, గురుగుబెల్లి జీవిత, ఉపాధ్యక్షులు కొంక్యాన మురళీధరరావు, కోశాధికారి తంగి స్వాతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్